సాక్షి నంద్యాల

ఆదివారం। 15। జూన్। 2025



ఇదేమి పైశాచికం!

బ్రాహ్మణదొడ్డి గ్రామంలో కొందరు దుండగులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను వేధిస్తున్నారు. నాలుగు ట్రాక్టర్ల గడ్డివామిని దగ్ధం చేసి పైశాచిక ఆనందం పొందారు. IIలో▸



రుద్రభూమిలో ఉద్రిక్తత

చెట్నేహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక కంచె ఏర్పాటుపై ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఒకానొక దశలో ఉద్రిక్తతకు దారి తీసింది. IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,603.61
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:26.654
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:6,618
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:128

న్యూస్‌రీల్

సంగమేశ్వరాలయంలోకి కృష్ణాజలాలు



పూజలు చేస్తున్న పురోహితులు రఘురామ శర్మ

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరాలయంలోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 885 అడుగులు కాగా శనివారం నాటికి 837.4 అడుగులకు చేరుకుంది. దీంతో ప్రాచీన సంగమేశ్వరాలయ ప్రాంగణంలోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. మరో రెండు రోజుల వ్యవధిలోనే కృష్ణాజలాలు గర్భాలయంలోని వేపధారు శివలింగాన్ని తాకనున్నాయి. దీంతో భక్తులు స్వామివార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం ఆలయ ముఖ మంటపం ముందున్న శివలింగం, బసవ విగ్రహం కృష్ణాజాలలో మునిగిపోతున్నందున ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీశైలానికి 22,731 క్యూసెక్కుల వరద


శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి శుక్రవారం నుంచి శనివారం వరకు 22,731 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. జూరాల, తుంగభద్రల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. జలాశయం నుంచి విద్యుత్ ఉత్పాదన అనంతరం 5,988 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 0.185 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 2.586 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 2.60 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శనివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 59.0461 టిఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 838.10 అడుగులకు చేరుకుంది.

భక్తులతో కిక్కిరిసిన 'మద్దిలేటయ్య'



బేతంచెర్ల: వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసింది. జ్యేష్ఠ మాసం శుభ దినాలను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆ తర్వాత స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళ హారతి, స్వామి వారికి ఇష్టమైన వరపూజ నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

తల్లికి వందనం కోతలే..!





→ ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన ఖాదర్ బాషా, కె.మౌలాబీ అనే దంపతులకు ముగ్గురు కూతుర్లు. 1వ తరగతి, 4వ తరగతి, 7వ తరగతులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో వీరికి అమ్మ ఒడి పథకం కింద నగదు జమ అయ్యింది. మూడు ఎకరాల భూమి ఉంటే ప్రస్తుతం వారికి 10 ఎకరాల భూమి ఉన్నట్లు చూపి అనర్హులను చేశారు.



→ గోనెగండ్ల మండలం ఆలువాల గ్రామానికి చెందిన శ్రీనివాస ఆచారి, వి.మహలక్ష్మీ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త వడ్రంగి పని చేస్తూ వారికి ఉన్న ఒక ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. మహలక్ష్మీ నిత్య కూలీ పనికి వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో వీరి అమ్మఒడి వచ్చింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద వీరికి 10 ఎకరాల భూమి ఉందని అనర్హులను చేశారు.

→ గూడూరు మండలం పొన్నకల్లు, జూలకల్లు గ్రామాలకు చెందిన సచివాలయం పరిధిలో 136 మందిని అనర్హుల జాబితాలో చూపించారు. ఇందులో 91 మంది చిన్న, సన్నకారు రైతులే. ఈ రైతుల భూములకు మూడు, నాలుగు దశాబ్దాల క్రితం సాగు నీరు వచ్చేది. రెవెన్యూ రికార్డుల్లో మాగాణి ఉండటంతో నిబంధనలతో అర్హులు కాలేదు. వీరికి గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం ఇచ్చింది. ప్రస్తుతం రాలేదు.

→ కోడుమూరు మండలంలో ఒకే ఆధార్ నంబరు 19 మంది విద్యార్థులకు చూపిస్తోంది. దీంతో ఎంపీపీఎస్ అనుగొండ, ఎంపీపీఎస్ పులకుర్తి, కర్నూలు శ్రీచైతన్య స్కూల్ , కర్నూలు నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు అమ్మ వందనం పథకం అమలు కాలేదు.

→ నిబంధనలతో జిల్లాలో 60 వేల మంది విద్యార్థులు.. తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యారు.

- అస్తవ్యస్తంగా తల్లికి వందనం పథకం అమలు
- జిల్లాలో 4.49 లక్షల మంది విద్యార్థులు
- 60 వేల మంది విద్యార్థులు అనర్హులు
- నిబంధల పేరుతో భారీగా కోత
- గత ప్రభుత్వంలో అమ్మ ఒడి వచ్చినా.. నేడు రాని వైనం
- ఫిర్యాదులకు 26 వరకే గడువు.. 30న తుది జాబితా

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక మరచిపోవడం.. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తే తూతూ మంత్రంగా అమలు చేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు అలవాటే. తల్లికి వందనం పథకం అమలును ఇందుకు నిదర్శనంగా ప్రజలు చూపుతున్నారు. సూపర్ సిక్స్ హామీల విషయాన్ని 2023 మే నెలలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబు చెప్పారు. రెండేళ్లు దాటిపోయింది. అధికారంలోకి వచ్చి మొదటి ఏడాది ఎగ్గొట్టి.. సాకులు వెతుక్కుంటూ ఏప్రిల్, మే నెలలో ఇస్తామన్నారు. తల్లికి వందనం పథకం అంటూ ఈ నెల 12వ తేదీన ప్రకటించి జాబితాలు విడుదల చేశారు. నిబంధనల పేరుతో చాలా మందిని అనర్హులను చేశారు.

తప్పుల తడకగా ...

ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లివందనం పథకం ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. ఎలాంటి నిబంధనలు ఉండబోవని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనలు విధించి తప్పులు తడకగా జాబితా రూపొందించారు. హౌస్‌హోల్డ్ సర్వే పేరుతో భారీగా కోత విధించారు. మొన్నటి వరకు ముగ్గురికి మాత్రమే అర్హత ఉండగా వ్యతిరేకత రావడంతో నలుగురికి, ఆ తరువాత ఐదుగురు వరకు పొడిగించారు. విద్యాశాఖ గణాంకాల ప్రకారమే జిల్లాలో 1,245 మంది తల్లులకు ఆరుగురు, ఆపై పిల్లలు ఉన్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం వీరందరూ అనర్హులే!

ని'బంధనాలు'

జిల్లాలో 4.49 లక్షల మంది విద్యార్థులు 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హౌస్ హోల్డ్ సర్వే చేశారు. ఈ సర్వే రిపోర్టు ఆధారంగా తయారు చేసిన తల్లికి వందనం జాబితాలను జిల్లాలోని 672 సచివాలయాలకు పంపించారు. అర్హులు, అనర్హుల జాబితా వేర్వేరుగా సచివాలయాల్లో ప్రదర్శించి ఫిర్యాదులు తీసుకుంటారు. తుది జాబితాను ఈనెల 30వ తేదీన ప్రకటించి జూలై 5వ తేదీన వీరితో పాటు 1వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకు తల్లికి వందనం నగదు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. భూముల విషయంలోనే ఎక్కువగా అనర్హులను చేసినట్లు తెలుస్తోంది. గౌరవ వేతనం వస్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సైతం తల్లి వందనం పథకానికి దూరం చేశారు.

కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు అనర్హులు

తల్లికి వందనం పథకంలో కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల వివరాలు లేవు. ఆ విద్యార్థులను ఈ పథకానికి పరిగణనలోకి తీసుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ విద్యార్థులకు అమ్మ ఒడి పథకం అందించింది. యూడైస్ ప్లస్‌లో కేంద్రీయ విద్యాలయ వివరాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిగా ఆ లింక్ తొలగిపోయింది. ఉద్దేశ పూర్వకంగా కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను విస్మరించారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

పేదలపైన కక్ష



మాది రెక్కాడితేనే కానీ డొక్కా నిండని కుటుంబం. చాలా నిరుపేద కుటుంబం అని గుర్తించి జగనన్న పాలనలో మాకు అమ్మ ఒడి పథకం వచ్చింది. పగిడ్యాలలో నా కుమారుడు 9వ తరగతి చదువుతున్నాడు. మాకు ఎలాంటి చరస్థిర ఆస్తులు లేవు. మాకు ఒకే కుమారుడు. చదివించే ఆర్థిక స్థోమత లేదు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం ఇవ్వాలి. జగనన్న పాలనలో అమ్మ ఒడి పథకం ఇచ్చారు. ఈ ప్రభుత్వం ఎందుకు ఇవ్వదు. మాలాంటి పేదలపైన కక్ష కట్టి తల్లికి వందనం ఇవ్వకుండా మోసం చేసింది.

– లలితమ్మ, పాలమర్రి గ్రామం, పగిడ్యాల మండలం



ఇద్దరికీ ఇవ్వాలి

మాకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఒకరు 8, మరొకరు 6వ తరగతి చదువుతున్నారు. ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా రూ.15వేలు చొప్పున రూ.30వేలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని ఆశగా ఎదురు చూశాం. గత ఏడాది వేస్తారని నమ్మి మోసపోయాం. ఈ ఏడాది తల్లికి వందనంలో ఇద్దరు పిల్లలకు గాను ఒకరికి మాత్రమే అకౌంట్‌లో జమ అయ్యింది. మరొకరికి జమ కాలేదు. మాది నిరుపేద కుటుంబం. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాం. హామీ మేరకు ఇద్దరికీ అమ్మవందనం ఇవ్వాలి.

–మహబూబ్‌బీ, నంద్యాల

ఒక్కరికే వచ్చింది



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు హైస్కూల్‌లో చదువుతున్నాడు. కుమార్తె ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుతోంది. తల్లికి వందనానికి సంబంధించి అర్హుల జాబితా గ్రామ సచివాలయంలో పెట్టారు. జాబితాలో పేర్లు చూస్తే అమ్మాయి పేరు ఉంది. అబ్బాయి పేరు లేదు. ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకం వర్తిస్తుందని చెప్పారు. నాకు వాహనాలు లేవు. ఎక్కువ పొలం కూడా లేదు. తల్లికి వందనం ఇద్దరికీ వచ్చేలా అధికారులు చూడాలి.

– పుల్లయ్య, మీర్జాపురం, కొలిమిగుండ్ల మండలం

కావాలనే ఇలా చేశారు



మా పెద్దమ్మాయి లక్ష్మి పదో తరగతి పూర్తి అయ్యింది. రెండో కుమార్తె వసంత ఏడో తరగతి పూర్తి అయ్యి ఇప్పుడు 8వ తరగతిలోకి వెళ్తోంది. మూడో కుమార్తె గంగోత్రి ఐదో తరగతి పూర్తి అయ్యి ఆరో తరగతిలోకి వెళ్తోంది. కుమారుడు విజయ్‌కుమార్ మూడో తరగతి నుంచి నాలుగో తరగతిలోకి ప్రవేశిస్తున్నాడు. నాకున్న నలుగురు పిల్లల్లో ఒక్కరికి కూడా తల్లికి వందనం పథకం డబ్బులు రాలేదు. గత ప్రభుత్వంలో డబ్బులు పొందాను. సచివాలయం అధికారులను అడిగితే మెట్ట భూమి పది ఎకరాలు అంతకంటే ఎక్కువ ఉన్నందున మీరు అనర్హులని చెప్పారు. మాకు 9.40 ఎకరాలు మాత్రమే పొలం ఉంది. ఈ ప్రభుత్వం కావాలనే చేసిందో మరేమో అర్థం కావడం లేదు.

– ఉలిగమ్మ, బిలేహాల్ గ్రామం, హాలహర్వి మండలం

'రికార్డు' స్థాయిలో మోసం



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబు రహీం సున్నిపెంటలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. అమ్మాయి రిజ్వాన పాములపాడులో 8వ తరగతి చదువుతోంది. గతంలో అమ్మాయి పేరిట అమ్మ ఒడి డబ్బులు నా బ్యాంకు అకౌంటులో జమ అయ్యాయి. ఈ సంవత్సరం అనర్హుల జాబితాలో పేరుంది. ఇదేమిటో అర్థం కావటం లేదు. పేరు రికార్డులో చేర్చలేదు అని కారణం చెప్పారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల పేర్లు రికార్డు చేయకపోవడమేమిటో వారికే తెలియాలి.

– మౌలాబి, వేంపెంట

ఎందుకు అనర్హులం?



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు స్కూళ్లకు వెళ్తున్నారు. మా పాప హాహీరా ఉర్దూ స్కూళ్లో 3వ తరగతి చదువుతోంది. బాబు షారిక్ ప్రైవేటు స్కూలులో 4వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరికీ తల్లికి వందనం పథకంతో రూ.30వేలు వస్తాయనుకున్నాం. గతంలో మా పాపకు అమ్మ ఒడి వచ్చింది. ఇప్పుడు ఒక్కరికీ కూడా రాలేదు. అనర్హుల జాబితాలో పేరున్నట్లు చెబుతున్నారు. మేం ఎందుకు అనర్హులమో అర్థం కావడం లేదు. చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాల్సిందే.

– షాహిరూన్, పాములపాడు

చంద్రబాబు ఏడాది పాలన అంతా అరాచకమే!



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, చిత్రంలో మేయర్ రామయ్య, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తదితరులు

- రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు
- హామీల పేరుతో 5 కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): చంద్రబాబు కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అంతా అరాచకమే అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బూటకపు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఐదు కోట్ల మంది ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కల్లూరులోని తన గృహంలో చంద్రబాబు ఏడాది పాలన వైఫల్యాలపై బుక్‌లెట్‌ను శనివారం ఆవిష్కరించారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల జగనన్న పాలనను చంద్రబాబు ఏడాది పాలనను ప్రజలు పోల్చి చూసుకుంటున్నారన్నారు. జగనన్న హయాంలో రాష్ట్రంలో నవరత్నాల పేరుతో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అవినీతి లేకుండా.. మధ్యవర్తులు లేకుండా నేరుగా అర్హుల అకౌంట్లలో నిధులు జమ అయ్యాయన్నారు. రెండేళ్ల కరోనా సమయంలోనూ ప్రతి ఒక్కరిని ఆదుకున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

మోసం చంద్రబాబు నైజం

టీడీపీ అధినేత చంద్రబాబుది మోసం నైజమని కాటసాని విమర్శించారు. ఏడాది పాలనలో ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. మహిళలను దగా చేశారని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉచిత బస్సు, ఏటా 5 లక్షల ఉద్యోగాలు, ప్రతి నెలా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.1500, 50 సంవత్సరాలు నిండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ. 4 వేలు పెన్షన్ అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు ఇప్పుడు ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. తల్లికి వందనం తూతూమంత్రంగా అమలు చేస్తూ రాష్ట్రంలో 30 లక్షల తల్లులకు ఎగనామం పెట్టారన్నారు.

అదుపు తప్పిన శాంతిభద్రతలు

ప్రజలకు ఏమీ చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ఏడాదంతా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని కాటసాని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట మహిళలపై హత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. రాష్ట్రంలో వాస్తవాలను తెలుసుకునేందుకు చంద్రబాబు ఏడాది పాలన వైఫల్యాలపై బుక్‌లెట్‌ను జిల్లా కేంద్రంలో, నియోజకవర్గం కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నీట్'లో మెరిసిన జిల్లా విద్యార్థులు

కర్నూలు సిటీ: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి గత నెల 4న నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. మంచి ర్యాంకులు సాధించారు. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాల్లో నీట్ నిర్వహించగా 4,381 మంది పరీక్ష రాశారు.



విద్యార్థి పేరు: దాసి హేమ సాగరిక
తల్లిదండ్రులు: డి.వెంకట శ్రీహరి బాబు, ఎస్.మంజుల వాణి
స్వస్థలం: రిచ్‌మండ్ విల్లాస రేడియో స్టేషన్, కర్నూలు
నీట్ ర్యాంకు: ఆల్ ఇండియా లెవెల్‌లో 1721, క్యాటగిరీలో 44వ ర్యాంకు(ఇటీవల విడుదల అయిన ఏపీ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంకు)
లక్ష్యం: పేదలకు వైద్య సేవలు అందించడం.



విద్యార్థి పేరు: రాయల గోవర్ధన్ చౌదరి
తల్లిదండ్రులు: రాయల యుగంధర్ చౌదరి, రాయల యామిని చౌదరి
స్వస్థలం: సంతోష్ నగర్
నీట్: ఆల్ ఇండియా లెవెల్ 431, క్యాటగిరీలో 281(ఏపీ ఈఏపీ సెట్ 65వ ర్యాంకు)
లక్ష్యం: మంచి వైద్యునిగా రాణించడం.



విద్యార్థి పేరు: బనవాసి ఇశాంత్
తల్లిదండ్రులు: బనవాసి రమేష్, బనవాసి శ్వేతశ్రీ
స్వస్థలం: గాంధీనగర్, కర్నూలు
ర్యాంకు: ఆల్ ఇండియా లెవెల్‌లో 657(రిషికేసి ఎయిమ్స్‌లో సీటు వస్తుంది)
లక్ష్యం: సివిల్స్



విద్యార్థి పేరు: ఎం.అఖిల్ బాలాజీ నాయక్
తల్లిదండ్రులు: డా.ఎం రామాంజనేయుల నాయక్, ఎస్.పి సావిత్రి బాయ్
స్వస్థలం: కర్నూలు
నీట్ ర్యాంకు: ఆల్ ఇండియాలో 4,169, క్యాటగిరిలో 27 (ఏపీ ఈఏపీ సెట్ ర్యాంకు 104)
లక్ష్యం: డాక్టర్

హుసేనాపురం విద్యార్థికి 181 ర్యాంక్



ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన విద్యార్థి జీకే సతీష్ చంద్ర రాయల్ 'నీట్' ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 181వ ర్యాంక్ సాధించాడు. విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదువుతూనే ఇంటర్ రెండో ఏడాది మొదటి దశలోనే 'నీట్' పరీక్ష రాసి ఈ ర్యాంక్ సాధించాడు.ఈ విద్యార్థి తండ్రి గడేకారి కొండా నాగశిరోమణి ఆర్ఎంపీగా, తల్లి శిరోమణి వైద్య,ఆరోగ్య శాఖలో ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్నారు.

వ్యవసాయ అధికారుల బదిలీల్లో కొనసాగుతున్న పైరవీలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ అధికారుల బదిలీల్లో పైరవీల పర్వం కొనసాగుతోంది. ఇటీవలి వరకు ఓర్వకల్ ఏఓగా పనిచేసిన సుధాకర్ ఆదోని మండల వ్యవసాయ అధికారిగా పోస్టింగ్ కోసం సర్వశక్తులు ఒడ్డారు. అయితే ఊహించని రీతిలో 20 నెలల క్రితం వరకు దాదాపు ఆరేళ్లు ఏఓగా పనిచేసిన పాపిరెడ్డి మళ్లీ ఆదోని ఏఓ పోస్టు దక్కించుకున్నారు. ఆదోని ఏఓ పోస్టును ఆశించిన సుధాకర్‌కు ఎమ్మిగనూరు ఫామ్ దక్కింది. అయితే ఆయన ఆదోని ఎమ్మెల్యే ద్వారా వ్యవసాయ శాఖ కమిషనర్‌పై ఒత్తిడి తేవడంతో పాపిరెడ్డిని వెనక్కి పంపి.. సుధాకర్‌ను ఆదోని ఏఓగా నియమించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. మార్పులు, చేర్పుల ఉత్తర్వులన్నీ 9వ తేదీతోనే జారీ అవుతుండటం గమనార్హం. కాగా గూడూరు ఏఓగా పనిచేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డిని మొదట కర్నూలు ఏడీఏ కార్యాలయం టెక్నికల్ ఏవోగా నియమించారు. ఈయనను గుత్తి ఏడీఏ కార్యాలయం టెక్నికల్ ఏవోగా బదిలీ చేశారు. 24 గంటలు గడవక ముందే మళ్లీ కర్నూలు ఏడీఏ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇక్కడకి బదిలీ చేసిన మంజుల గుత్తి ఏడీఏ కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు ఉత్తర్వుల జారీ అయ్యాయి.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



ఇండోర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): యోగా చేస్తే మానసిక ఒత్తిడికి దూరం కావొచ్చని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం మాస్ డెమో యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారన్నారు. జిల్లాలో గుర్తించిన ప్రదేశాల్లో యోగా కార్యక్రమాల నిర్వహణకు మాస్ డెమో చేపట్టామన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ.. యోగాను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో అనంతరం ఆనంద్ గురూజీ బృందం యోగసనాలు వేయించారు. డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారి యశోధర వివిధ యోగ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

5 వేల మందితో..

నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులో ఈనెల 16వ తేదీన 5వేల మందితో యోగా కార్యక్రమాల నిర్వహణ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

మహానందిలో వీకెండ్ సందడి



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: వీకెండ్ కావడంతో మహానంది ఆలయం శనివారం భక్తులతో కళకళలాడుతుంది. వేసవి సెలవులు ముగిసినా వీకెండ్ కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది క్షేత్రాలను సందర్శించి రాతి నంది, పెద్దనంది విగ్రహాలను తిలకించి భక్తులు సేదతీరారు.

రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక అంధుల సంక్షేమం వసతి గృహంలో శనివారం రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్ అనుబంధం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రెండవ రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. పోటీలను రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, మంత్రి తనయుడు ఫిరోజ్, నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు రవికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ క్రీడా కోట దివ్యాంగులకు అవకాశం కల్పిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. క్రీడాకారులకు భవనాశి నాగమహేష్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కల్నల్ ఫిలిప్, ఖలీల్, వలిబాషా, నాగమహేష్, జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రభూమిలో ఉద్రిక్తత

- చెట్నెహళ్లిలో శ్మశాన కంచె ఏర్పాటుపై తీవ్ర నిరసన
- కంచెకు వ్యతిరేకంగా భీష్మించిన హిందూ వర్గీయులు
- ఇరువర్గాలతో జేసీ చర్చలు విఫలం
- గ్రామంలో ఉద్రిక్తత.. భారీ బందోబస్తు



పిల్లర్‌ను తొలగిస్తున్న వృద్ధులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

మంత్రాలయం/మంత్రాలయం రూరల్: తరతరాల రుద్రభూమి కోసం ఊరు ఏకమైంది. కంచె ఏర్పాటుపై ఆగ్రహం కట్టలు తెంచుకుంది. శాంతియుతంగా మొదలైన తిరుగుబాటు సాయంత్రానికి ఒకానొక దశలో ఉద్రిక్తతకు దారి తీసింది. హుటాహుటినా జేసీ సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. హిందువుల తిరుగుబాటుతో అధికారులు నిశ్చేష్టులయ్యారు. మంత్రాలయం మండలం చెట్నెహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక విషయంలో ఓ సామాజిక వర్గం, హిందూ వర్గాల మధ్య కొన్ని నెలలుగా విభేదాలు తలెత్తాయి. తమ ఇళ్లను ఆనుకుని ఉన్న శ్మశాన వాటికలో హిందువుల ఖననాన్ని ఖండిస్తూ సామాజిక వర్గీయులు పలుమార్లు ఆందోళనలకు దిగారు. ఇటీవల ఓ రైతు మృతదేహం ఖననం విషయంలో సామాజిక వర్గీయులు అడ్డుపడటం జరిగింది. అప్పటి నుంచి శ్మశాన వివాదం ముదిరిపోయింది. తరాలుగా వస్తున్న శ్మశానాన్ని వదులుకోమంటూ హిందువులు భీష్మించారు. మూడు రోజుల క్రితం కలెక్టరేట్ ఎదుట కూడా నిరసనకు దిగారు. దీంతో శ్మశాన స్థల వివాదాన్ని సద్దుమణిచేందుకు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రంగంలోకి దిగారు. శుక్రవారం ఇరు వర్గాలతో మంత్రాలయం రెవెన్యూ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమీక్షలో ఇరు వర్గాల అభిప్రాయం మేరకు శనివారం కంచె ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు పోలీసు బలగాలతో వచ్చారు.

కంచె ఏర్పాటు అడ్డగింత..

గ్రామంలోని సర్వే నంబర్ 113లో 3.83 ఎకరాలు, సర్వే నం.114బీలో 1.02 ఎకరాల్లో ప్రభుత్వం రస్తా పోరంబోకు భూమి ఉంది. అందులో 113లోని దాదాపు ఎకరా భూమిలో ఓ సామాజిక వర్గీయులు ఇళ్లను నిర్మించుకున్నారు. ఇంకొంత భూమిలో గురుబోధకుల సమాధులు ఉండగా.. 0.47 సెంట్ల స్థలం రస్తా పోరంపోగు మిగిలింది. ఈ భూమికి కంచె ఏర్పాటు చేసేందుకు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ నేతృత్వంలో పూనుకున్నారు. సామాజిక వర్గీయుల ఇళ్ల వైపు 20 అడుగులు వదిలి కంచెను వేయడం మొదలుపెట్టారు. అక్కడి నుంచి 56 అడుగుల వెడల్పుతో కంచె వేయాలని ముందుగా కొలతలు వేసి పిల్లర్లు పాతేందుకు మార్కు వేశారు. ఒప్పందం ప్రకారం కంచె వేయడం లేదంటూ ఒక్కసారిగా హిందూ మహిళలు శ్మశాన వాటికలోకి దూసుకువచ్చారు. అంతవరకు దూరంగా ఉన్న మహిళలు దూసుకురావడంతో కంచె నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. ఇలాగైతే కంచెను వేయనీయమంటూ శ్మశానంలో పనులు నిలిపేసి బైఠాయించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు అలాగే కూర్చుని శాంతియుతంగా ఆందోళనకు దిగారు.

సర్దుబాటుకు ససేమిరా..

కంచె ఏర్పాటుకు హిందువులు అడ్డుపడగా సబ్ కలెక్టర్ జోక్యంతో 40 అడుగుల వెడల్పుకు కుదించారు. ఎంతకీ ఒప్పుకోకపోవడంతో సమస్య జటిలంగా మారడంతో జాయింట్ కలెక్టర్ నవ్య గ్రామానికి చేరుకున్నారు. హిందువుల కోరిక మేరకు 30 అడుగుల వెడల్పుతో కంచె వేసేందుకు సర్దుబాటు చేశారు. అందుకు ఓ సామాజిక వర్గీయులు ససేమిరా అనడంతో వేరే మార్గం లేక జేసీ వెనుదిరిగారు. అంతకు ముందు జేసీ మాట్లాడుతూ గ్రామస్తులంతా ఐక్యంగా ఉండాలని, పంతాలకు వెళ్లరాదని సూచించారు. రాజీమార్గంలో శ్మశాన వివాదాన్ని పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం కలెక్టర్ నిర్ణయం మేరకు కంచె ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అయితే 'మీకు మొక్కుతాం .. అమ్మా' మాకు న్యాయం చేయండి అంటూ హిందూ మహిళలంతా జేసీని వేడుకున్నారు. చివరగా ఇరువర్గాలతో సమావేశమైనా ఫలితం లేకపోయింది. శ్మశాన విషయంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా ప్రవర్తించినా ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయాలంటూ జేసీ స్థానిక సీఐ రామాంజులుకు ఆదేశించి వెనుదిరిగారు. ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా డీఎస్పీ ఉపేంద్రబాబు నేతృత్వంలో ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150 పోలీసుల బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య



ఆత్మహత్యకుపాల్పడిన శ్రీను (ఫైల్)

చాగలమర్రి: చిన్నవంగలి గ్రామంలో ఓ యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు కుమారుడు చాకలి శ్రీను (20) కూలీ పనులకు వెళ్తి జీవనం సాగించేవాడు. శుక్రవారం సమీపంలోని వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం బయనపల్లె గ్రామంలో ఉన్న అవ్వ ఇంటికి వెళ్లి అదే రోజు అర్ధరాత్రి తిరిగి వచ్చాడు. మిద్దెపై నిద్రిస్తున్న తల్లిదండ్రులు శనివారం తెల్లవారుజామున కిందకు వచ్చి చూడగా శ్రీను నిద్రిస్తున్న గదికి గడియ పెట్టుకుని ఉండటంతో అనుమానంతో పగులగొట్టి చూశారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో కేకలు వేశారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తన సెల్ ఫోన్‌ను పగులగొట్టి ఇంట్లో ఉన్న నీటి కుండలో వేసినట్లు గుర్తించారు. కాగా ఓ యువతిని కొన్ని రోజులుగా ప్రేమిస్తున్నాడని, ఆ ప్రేమ వ్యవహారం విఫలమైందని, ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి శ్రీను సెల్‌కు ఎవరో కాల్ చేసి బెదిరించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఇదేమి పైశాచికం!

- బ్రాహ్మణదొడ్డిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఆస్తుల ధ్వంసం
- సర్పంచ్ గడ్డివామిని తగులబెట్టిన దుండగులు
- మరో వ్యక్తి ఇంటి బండలను పగులగొట్టిన వైనం



షెడ్ బండలు ధ్వంసం చేసిన దృశ్యం



దుండగులు తగులబెట్టడంతో కాలిపోతున్న సర్పంచ్ దస్తగిరి గడ్డివామి

సి.బెళగల్: పోలీస్ పికెట్ ఉన్నప్పటికీ బ్రాహ్మణదొడ్డి గ్రామంలో కొందరు దుండగులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేసి వేధిస్తున్నారు. వారి ఆస్తులను తగులబెట్టడంతో పాటు ధ్వంసం చేస్తున్నారు. గ్రామంలో టీడీపీకి చెందిన వారు సర్పంచ్ దస్తగిరి, ఆయన అనుచర వర్గంపై వైరం పెంచుకుని తరచూ ఘర్షణకు దిగుతున్నారు. రెండు నెలల క్రితం సర్పంచ్, అతడి కుటుంబ, బంధువులు, సానుభూతిపరులపై భౌతిక దాడులు చేశారు. ఈక్రమంలో గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం రాత్రి దుండగులు దస్తగిరికి చెందిన చెందిన నాలుగు ట్రాక్టర్ల గడ్డివామిని (పశుగ్రాసంను) నిప్పంటించి పైశాచిక ఆనందం పొందారు. అదేవిధంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉన్న మేకల రాముడు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్న షెడ్ బండలను సైతం ధ్వంసం చేశారు. కాగా గ్రామంలో పోలీస్ పికెట్ ఉన్నా గ్రామంలో టీడీపీ వారు అరాచకాలు సృష్టిస్తూ, ఆస్తులను నాశనం చేస్తుండటంపై గ్రామంలో ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. కాగా గ్రామంలో అరాచకాలకు పాల్పడే దుంగడులను గుర్తించి, తమకు రక్షణ కల్పించాలని, అదేవిధంగా తమకు న్యాయం చేయాలని బాధితులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామానికి చెందిన కళావతి (33) అనే మహిళ శనివారం విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ప్రభావతి, నాగేశ్వరరావు దంపతుల కుమార్తె కళావతికి అనంతపురం జిల్లా కనెకల్లు మండలం అనుమాపురం గ్రామానికి చెందిన రఘు అనే వ్యక్తితో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. అయితే 13ఏళ్ల క్రితం కళావతి భర్త రఘు మృతి చెందాడు. అప్పటి నుంచి కళావతి పుట్టింటిలో జీవనం సాగిస్తుంది. భర్త మీద దిగులుతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో విషగుళికలు మింగి అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు సీఐ వివరించారు. తల్లి ప్రభావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

- 38.4 తులాల బంగారు, 32.6 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

బొమ్మలసత్రం: రెండు తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడి 36 కేసుల్లో నిందితులుగాఉన్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ భవనంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా పాతగుంటూరుకు చెందిన పవన్‌కుమార్, తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెకు చెందిన శివశంకర్‌కు గతంలో జైలులో పరిచ యం ఏర్పడింది. అప్పటికే పవన్‌కుమార్‌పై 32 చోరీ కేసులు, శివశంకర్‌కు 21 చోరీ కేసులు పలు ప్రాంతాల్లో నమోదు కాబడ్డాయి. ఇద్దరు కలిసి ఈ ఏడాది నందికొట్కూరు బాలాజీ నగర్‌లో చోరీకి పాల్పడ్డారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుల ఆచూకీని కనిపెట్టి శనివారం అరెస్ట్ చేశారు. నిందితులను విచారించగా వారిపై గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి, రాజమండ్రి, అనంతపురం అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లోనే కాకుండా తెలంగాణలో కూడా కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. వారి నుంచి 39.4 తులాల బంగారు ఆభరణాలు, 32.6 తులాల వెండి ఆభరణాలు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఇబ్రహీమ్, ఏసుదాసు, చంద్రశేఖర్, సిబ్బంది బాలకృష్ణ, ఓబయ్య, రంగారామ్, చిన్నమద్దిలేటి, మాలిక్‌బాషా, కృష్ణమనాయుడు నాగరాజు, వెంకటేశ్వర్లులను అడిషనల్ ఎస్పీ అభినందించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని యువతకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా విజ్ఞప్తి చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి ఆవరణలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాత దినోత్సవంగా నిర్వహించుకుంటామన్నారు. 'తమకు తెలియని వ్యక్తుల కోసం తమ రక్తాన్ని దానం చేసే నిస్వార్థ వ్యక్తులకు గుర్తింపుగా ఈ సంవత్సరం రక్తం ఇవ్వండి, ఆశను ఇవ్వండి, కలిసి మనం ప్రాణాలను కాపాడుకుందాం' అనే నినాదంతో ఈ ఏడాది కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 45 వేల యూనిట్లు అవసరం కాగా కేవలం 35 వేల యూనిట్లు మాత్రమే లభ్యం అవుతోందన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు ఈ యేడాది చర్యలు తీసుకోవాలని, కళాశాలల్లో అవగాహన కల్పించి యువతను చైతన్యపరచాలని కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా మేలు జరుగుతుందని చెప్పారు. గుండెపనితీరు కూడా మెరుగుపడుతుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా ప్రతి సంవత్సరం ఏడు వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నామన్నారు. అంతకుముందు రక్తదానం చేస్తున్న కర్నూలు మెడికల్ కాలేజి పీజీ వైద్య విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలో రక్తదాన కార్యక్రమానికి ప్రోత్సహించిన స్వచ్ఛంద సంస్థలు, రక్తదాతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ కర్నూలు శాఖ అధ్యక్ష్య, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ మాధవీశ్యామల పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు వేళాయె!

- ఈనెల 21వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం
- 21 నుంచి ఆప్షన్ల ఎంపిక
- 3న సీట్ల కేటాయింపు



నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 30న నిర్వహించిన పాలిసెట్‌లో జిల్లా వ్యాప్తంగా 5,400 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారు పాలిటెక్నిక్ కోర్సులలో అడ్మిషన్లకు ర్యాంకుల వారీగా ఇచ్చిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకూ నిర్వహించే కౌన్సెలింగ్‌లో వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు. ఈ విద్యార్థులు నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, బేతంచెర్ల, నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎక్కడైనా కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం దగ్గరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి ఉచితంగా ఆప్షన్లు ఎంచుకోవచ్చు. వారికి ఇచ్చిన తేదీ ప్రకారం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందాలి. జిల్లాలో మూడు ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రైవేటు యాజమాన్యంలో మరో రెండు కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలు కళాశాలల్లో ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 వరకూ సీట్లు ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 66, మెకానికల్ 132 చొప్పున, రెండు ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సుమారు 198 సీట్లు ఉన్నాయి. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) కింద ప్రతి బ్రాంచ్‌లో అదనంగా 10 శాతం సీట్లు పెంచి ప్రవేశాలు కల్పిస్తారు. పాలిటెక్నిక్ కోర్సు కాలవ్యవధి మూడు సంవత్సరాలు.

జిల్లాలో సీట్ల వివరాలు..

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నంద్యాల : డీసీఈ సివిల్ ఇంజినీరింగ్ 66, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 132, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ 132, డీఎంఈ మెకానికల్ ఇంజినీరింగ్ 132

శ్రీశైలం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల : డీసీఈ 66, డీఈసీఈ 66, డీఈఈఈ 66, డీఎంఈ 66

బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల : డీఏఐఈ 66, డీఈసీఈ 66, డీఈఈ 66, డీఎంఈ 66

కౌన్సెలింగ్ ఇలా..

- కౌన్సెలింగ్‌కు హాజరయ్యే ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో ప్రాసెస్ ఫీజు చెల్లించాలి.
- ఫీజు చెల్లించిన రశీదు. పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పది మార్కుల జాబితా, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ అందజేయాలి.
- స్టడీ సర్టిఫికెట్ లేని వారు ఏడేళ్ల రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వర్తించే వారు అర్హత ధ్రువపత్రం అందజేయాలి.

ప్రత్యేక కేటగిరికి విజయవాడలో కౌన్సెలింగ్



ప్రత్యేక కేటగిరిలో భాగంగా ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్స్ పీడబ్ల్యూడీ, క్యాప్, స్కౌట్ వంటి వారికి ఈ నెల 25 నుంచి 28వ వరకూ విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. పాలిసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, షెడ్యూల్ ప్రకారం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలి. ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. – శ్రీనివాసప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నంద్యాల